క్లుప్తంగా

నేడు వలంటీర్లకు వందనం కార్యక్రమం

వల్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి పాల్గొంటారని ఎంపీడీవో విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని గ్రామ వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

హైవే అధికారులపై మండిపడ్డ స్థానికులు

చెన్నూరు : చెన్నూరు పాత రోడ్డుకు అడ్డంగా డివైడర్లు అడ్డం పెడితే ఎలా వెళ్లాలి అని స్థానిక ప్రజలు జాతీయ రహదారి అధికారులను ప్రశ్నించారు. ఆదివారం కడప–కర్నూల్ జాతీయ రహదారి గోసుల కల్యాణ మండపం క్రాస్ వద్ద నుంచి చెన్నూరు పాత రోడ్డు వద్దకు వెళ్లే రహదారికి అడ్డంగా నేషనల్ హైవే అధికారులు డివైడర్లతో రోడ్డును మూసి వేసేందుకు ప్రయత్నం చేయగా చెన్నూరుకు చెందిన మైనార్టీ నాయకులు, అలాగే గ్రామ ప్రజలు ఆ పనులను అడ్డుకున్నారు. దీంతో చేసేది ఏమీ లేక నేషనల్ హైవే అధికారులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

మానవత సంస్థ సేవలు హర్షణీయం

వేంపల్లె : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు హర్షణీయమని ఖాన్ కా రిస్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తారఫ్ ఆలీ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మాసంతర మానవత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ఎంతో మంది అనాథలు, అభాగ్యులు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. అలాంటి వారికి అండగా నిలుస్తూ చేయూతనందిస్తూ మానవత సేవలు ప్రశంసనీయమన్నారు. రానున్న రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజా మన్ననలు పొందాలన్నారు. అలాగే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన భవన నిర్మాణానికి ఆ సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి రూ.50వేలు, కన్వీనర్ బి.రంగారెడ్డి రూ.5వేలు విరాళం ప్రకటించారు. దాతలు ముందుకొచ్చి మానవత భవన నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు బాలాజి, డైరెక్టర్లు డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, కోశాధికారి శ్రావణ్, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు సమీర్, మదార్, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అచ్చివెళ్లి గంగమ్మ

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెళ్లి గ్రామంలో వెలసిన అచ్చివెళ్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మ తల్లిగా అచ్చివెళ్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధి గాంచింది. అమ్మవారిని దర్శించుకునేందుకు పులివెందుల ప్రాంతం నుంచేకాక కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

నెరవేరిన పేదల సొంతింటి కల



ఎర్రిపల్లె గ్రామంలో ప్రారంభానికి సిద్ధమైన జగనన్న కాలనీ, కమ్యూనిటీ భవనం

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీలో సుమారు 50 పక్కాగృహాలను నిర్మించారు. పక్కాగృహాలను సోమవారం ఉదయం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు ప్రారంభించనున్నారని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి తెలిపారు. అలాగే అచ్చివెళ్లి, ఎర్రిపల్లె గ్రామాల్లో రూ.97లక్షలతో నిర్మించిన అభివృద్ధి పనులను వారు ప్రారంభిస్తారన్నారు. ఎర్రిపల్లెలో కమ్యూనిటీ హాలు, అంగన్‌వాడీ సెంటర్‌ను, అచ్చివెళ్లి గ్రామంలో డిజిటల్ లైబ్రరీలను ప్రారంభిస్తారన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

చాపాడు : విద్యార్థులు, యువకులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమిరుద్దీన్ అన్నారు. చాపాడులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. అమీరుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చక్రస్నానం.. సర్వపాపహరణం



స్నపన తిరుమంజనంలో శ్రీవెంకటరమణస్వామి

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీవేంకటరమణుడి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో చివరిఘట్టమైన చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో ఉన్న కొలనులో చక్రస్నానం ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా స్నపన తిరుమంజనాన్ని ఆలయ అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతంతో అభిషేకించి తిరుమల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శ్రీగంధం, కుంకుమ పువ్వులేపనంతో అలంకరించారు. తులసిమాల, సుగంధ వట్టివేరు మాలలతో అలంకరించి మంగళ స్నానాలు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవిందా..గోవిందా అంటూ దేవదేవున్ని వేడుకున్నారు. మహా మంగళహారతులు పట్టారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన కొలనులో చక్రస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు కూడా ఆకొలనులో మునిగితేలారు. సాయంత్రం యాగశాలలో కలశారాధన ప్రధాన నిత్య హోమాలు, విశేష హోమాలు చేసి పూర్ణాహుతి చేపట్టారు. ధ్వజావరోహణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు

– రేపు రంగనాథుని కల్యాణం



పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో జరుగుతున్న శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు సతీసమేతుడై హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మండపంలో అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు పర్యవేక్షించారు. సాయంత్రం పట్టణ పురవీధులలో స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజార్, ముత్యాలవారివీధి, గాడిచర్లవీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా ఊరేగారు. ప్రత్యేక అలంకారంలో ముగ్ధమోహన రూపుడైన స్వామివారు తమ ఇంటి ముందుకు రాగానే భక్తులు చదుర్లు(ప్రత్యేక పూజలు) నిర్వహించారు. కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 6వ రోజు మంగళవారం ఉదయం శ్రీరంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు



ఆలయంలో ప్రతిష్టించిన ధ్వజస్తంభం



కోలాట పోటీలలో కళాకారులు

వేముల : మండలంలోని వేల్పుల గ్రామంలో మూడు ఆలయాలలో విగ్రహ ప్రతిష్ట వేడుకలు రెండవ రోజు వైభవంగా జరిగాయి. పురోహితులు గోపినాథ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, అంకాలమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో యాగశాల, హోమగుండాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, అంకాలమ్మ ఆలయాలను నూతనంగా నిర్మించారు. మూడు రోజులపాటు జరిగే వేడుకలు శనివారంతో ప్రారంభమై సోమవారం విగ్రహ ప్రతిష్టతో ముగియనున్నాయి. వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట వేద మంత్రోచ్ఛరణలతో ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి ఏర్పాట్లు చేశారు.

చెక్కభజన, కోలాట పోటీల నిర్వహణ :

గ్రామంలో మూడు ఆలయాలలో విగ్రహ ప్రతిష్ట వేడుకలను పురస్కరించుకుని కోలాటం, చెక్కభజన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 30 టీంలు పోటీలలో పాల్గొంటున్నాయి. ఒక్కో టీంతో నాలుగు పాటలు పాడించనున్నారు. ఈ పోటీలకు నగదు బహుమతులను అందిచనున్నారు. ఆలయాలలో విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని 10 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

పార్నపల్లెలో బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం

లింగాల : మండలంలోని పార్నపల్లె గ్రామంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.శశిభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రత్యేక వాహనం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఇతర కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుప్రకాష్, మహేశ్వరరెడ్డి, సుష్మాలతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలి



మృతురాలి కుటుంబ సభ్యులనుంచి కార్నియాలను అందుకుంటున్న రాజు, తదితరులు

తొండూరు : ప్రతి కుటుంబం నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కృష్ణంగారిపల్లెకు చెందిన ఉమ్మడి నారాయణమ్మ శనివారం రాత్రి అనారోగ్యంతో మరణించింది. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజుకు సమాచారం అందడంతో కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన వెంటనే 9966509364, 7093204537 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 30 కుటుంబాలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తదితరులు

వేంపల్లె : మండల పరిధి చింతలమడుగుపల్లెలోని జగనన్న కాలనీలో 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఆదివారం జగనన్న కాలనీలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీ గాయత్రిలు ఆ కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆకుల సురేష్, సీతారాముడు, వాకిటి శివ, పిల్లవాళ్ల లక్ష్మీనాగయ్య, పారి శివలతోపాటు తదితర కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యమైందన్నారు. మునుపెన్నడూ చూడని విధంగా మండలస్థాయి నుంచి గ్రామస్థాయికి పాలనను తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి గత ఎన్నికలలో ఓడిపోయారని.. మళ్లీ ప్రజలను మోసగించేందుకు సిద్ధంగా ఉన్నారని.. ప్రజలు కూడా మళ్లీ మోసపోయేందుకు సిద్ధంగా లేరన్నారు. మాట తప్పని, మడమ తిప్పని సీఎం జగన్‌పై బురద చల్లే ప్రయత్నం మానుకోవాలని టీడీపీ నేతలకు వారు సూచించారు. మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రభుత్వమేనని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొండయ్య, పఠాన్ రహమతుల్లా, ఎస్సీ కన్వీనర్ జయరాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి



రెడ్డినగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు, తదితరులు

వేంపల్లె : స్థానికరెడ్డి నగర్, ఉషాకిరణ్ పాఠశాల వీధులలోని రోడ్లకు మరమ్మతు చేయాలని పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డికి సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు సూచించారు. ఆదివారం ఆయన ఈఓతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి నేపథ్యంలో యూజీడీ పనులు చేపట్టగా.. రోడ్లను ఎక్కడిపడితే అక్కడ తవ్వారని.. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్లను పరిశీలించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఈఓను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భారతి, వార్డు సభ్యులు అంజి, షుకూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మూల గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని గొందిపల్లె గ్రామ పంచాయతీ బాలయ్యగారిపల్లె గ్రామ పొలాల్లో వెలసిన శ్రీమూల గంగమ్మ నూతన గుడి, విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ఆదివారం ఆలయ కార్యనిర్వాహకుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో విగ్రహాలకు గణపతిపూజ, ఆకుపూజ, హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం బండలాగుడు పోటీలను రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డిలు ప్రారంభించారు. ముందుగా వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, ధనుంజయరెడ్డి, రామగంగిరెడ్డిలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ అండగా జగనన్న ప్రభుత్వం



ఎద్దులవాండ్లపల్లెలో సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : జగనన్న ప్రభుత్వం ప్రతి ఇంటికి అండగా నిలబడుతోందని మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని గంగారపువాండ్లపల్లె పంచాయతీలోని ఎద్దులవాండ్లపల్లె, గొట్లమిట్టల్లో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. ఇలాంటి పథకాలు గత తెలుగుదేశం ప్రభుత్వంలో లేవన్నారు. మళ్లీ జగనన్నకు ఓట్లు వేసి ముఖ్యమంత్రిని చేసుకుంటే ఇలాంటి పథకాలు ఇంకా ఎన్నో అమలు చేస్తాడన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, సర్పంచ్ నాగేశ్వరమ్మ, పార్టీ నేతలు మల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గంగిరెడ్డి, ఉత్తమారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామాంజులరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విజయదుర్గ హోమం



పూజలందుకుంటున్న ప్రధాన ఉత్సవ కలశాలు

కడప కల్చరల్ : నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవరోజు ఆదివారం శ్రీ విజయదర్గాదేవి హోమంతో పాటు గణపతి, చండీహోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మూల విరాట్‌మూర్తికి నవకలశ స్నపనం (అభిషేకం) నిర్వహించారు. ఇందులో భాగంగా పుణ్యనదీజలాలు నింపిన కలశాలతో భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. అభిషేకనంతరం అమ్మవారికి కనుల పండుగా బ్రహ్మోత్సవ అలంకారం చేశారు. ఆలయ వ్యవస్థాపకులు యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. వేద పండితులు సహజ పద్ధతిలో హోమగుండాన్ని వెలిగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నవావరణ శ్రీ చక్రార్చన నిర్వహించారు. వృషభ వాహనంపై కొలువుదీర్చారు. రథాన్ని భక్తులు జయజయధ్వానాలు చేస్తూ ఆలయ ప్రదక్షిణ చేయించారు.

నేడు కల్యాణోత్సవం

ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

నేడు వేల్పులలో ఎంపీ పర్యటన

వేముల : మండలంలోని వేల్పుల గ్రామానికి సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా బెస్తవారిపల్లె గ్రామ సమీపంలోని బ్రమరాంబిక ఆలయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి గ్రామంలోని జగనన్న కాలనీలో వాటర్ ప్లాంటు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలను ప్రారంభిస్తారు. అక్కడ నుంచి మదర్సా స్కూలుకు చేరుకుంటారు. ఈ సందర్భంగా వేల్పుల వరకు బైకు ర్యాలీ ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి వేల్పులలోని చర్చికి చేరుకుంటారు. అక్కడ నూతనంగా నిర్మించిన బస్సు షెల్టర్‌ను ప్రారంభించి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తారు. అక్కడ నుంచి రూ.1.65 కోట్లతో నిర్మించిన ప్రాథమికోన్నత పాఠశాల భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి, అంకాలమ్మ ఆలయాలలో విగ్రహ ప్రతిష్ట వేడుకలలో పాల్గొంటారు. అలాగే రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభించి తిలకించనున్నారు.

నేడు జమ్మలమడుగుకు రాక..

జమ్మలమడుగు : వైఎస్సార్ జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డితో కలసి సోమవారం జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మైలవరం మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వర్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు మండలంలోని పొన్నతోట గ్రామం, 3:30 గంటలకు పట్టణంలోని క్యాంబెల్ హస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టిన్ రాజు అనుచరులతో పార్టీలో చేరిక, సాయంత్రం 4:30 గంటలకు గొరిగెనూర్ గ్రామంలో పార్టీలో చేరికల కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం మైలవరం మండలంలోని చిన్నకొమెర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లను ప్రారంభిస్తారన్నారు. కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

కడప ఎడ్యుకేషన్ : మార్చి 3న ప్రతి చిన్నారికి తప్పని సరిగా పోలియో చుక్కలను వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉందని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. రాయల్ రషీదు అసోసియేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన చిన్నారులకు పోలియో చుక్కలు అనే పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఆదివారం (3వ తేదీన) పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల పిల్లల వరకు పోలియో చుక్కలను వేయించుకోవాలన్నారు. ఈ విషయంపై బస్టాండులు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు రాయల్ కరీముల్లా, మాజీ కార్పొరేటర్ జమాల్‌వల్లి, గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం

ప్రొద్దుటూరు : మండలంలోని తాళ్లమాపురం పంచాయతీ మూలవారిపల్లెలో చర్చి నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం ఇస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. తాళ్లమాపురం పంచాయతీ సర్పంచి మాచిరెడ్డి కొండారెడ్డి, ఉపసర్పంచి మాచిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వీరారెడ్డి, జేష్టాది భాస్కర్, మూలవారిపల్లె గ్రామ చర్చి సంఘ పెద్దలు ఎమ్మెల్యేను కలిసి ఆదివారం చర్చి నిర్మాణానికి సహకరించాలని కోరారు. దీంతో రూ.10 లక్షలు ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంఘ పెద్దలు సి.రాజు, ఎం.చిన్నబాబు, జె.రవి, ఎ.రమేష్, కనకరాజు, చంటి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



వేములలో గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



సింహాద్రిపురంలో అప్పటి గురువు వీరనారాయణరెడ్డిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

వేముల : వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. పదవ తరగతి పూర్తైన తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 36 సంవత్సరాల తర్వాత ఆదివారం ఒకే చోటికి చేరుకున్నారు. వీరి కలయికతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చదువుకునే రోజుల్లో నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించి గురు భక్తిని చాటుకున్నారు. పూర్వపు విద్యార్థులు తమవంతు సాయంగా రూ.10 లక్షలతో పాఠశాలకు నిధి ఏర్పాట చేస్తున్నారు. పాఠశాల పేరుతో బ్యాంక్‌లో ఖాతా తెరిచి నిధి ఏర్పాటు చేసి వచ్చే వడ్డీతో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులను అందించాలని నిర్ణయించుకున్నారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి వి.అరవిందనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 1967–68 విద్యా సంవత్సర పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు అపూర్వ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువు వీరనారాయణ రెడ్డిని పూర్వ విద్యార్థులందరూ కలిసి సత్కరించారు. విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వి.అరవిందనాథరెడ్డి స్వయంగా రచించిన ఆయన జీవిత ప్రస్థానం పుస్తకాన్ని స్నేహితులతో కలిసి ఆవిష్కరించి బహుకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూ హాస్టల్స్ పరిశీలించిన ఆర్డీఓ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వసతి గృహాలను కడప రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్.మధుసూదన్ సందర్శించారు. ఆదివారం విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న గ్రూప్– 2 పరీక్షలను తనిఖీ చేసేందుకు వచ్చిన ఆర్‌డీఓ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిశారు. అనంతరం వారిరువురూ కలిసి వసతిగృహాలను, పరిసరాలను, వంటశాలలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఇటీవల అస్వస్థతకు గురై కోలుకుని హాస్టల్‌కు వచ్చిన ముగ్గురు విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందిన వైద్యసేవలు, వసతి గృహ సౌకర్యాలపై ఆరా తీశారు. అనారోగ్యానికి గురైన వెంటనే వైవీయూ అధికారులు రిమ్స్‌కు తీసుకువెళ్లి వైద్యం అందేలా చూశారని, అక్కడే ఉండి తమకు ధైర్యం చెప్పారని విద్యార్థినులు సమాధానం ఇచ్చారు. విశాఖపట్నం నుంచి వచ్చిన విద్యార్థిని తల్లి ఒకరు స్పందిస్తూ మా పిల్లలను కన్నవారిలా చూసుకున్నారని తెలిపారు. హాస్టల్లో ఉన్న 30 మంది విద్యార్థినులతో ఆర్‌డీఓ ప్రత్యేకంగా మాట్లాడారు. అందరం ఒకే ఆర్‌ఓ ప్లాంట్ నీరు తాగుతున్నామని, భోజనం కూడా ఒకే చోట చేశామని, మాకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని విద్యార్థినులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం కోసం వైవీయూ అధికారులతోపాటు, కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని ఆర్‌డీఓ వారికి భరోసా ఇచ్చారు.